# చేదు నిజాలు

"పార్వతీ! పార్వతీ! పారూ! త్వరగారా! త్వరగా రావోయ్!" వీధిగుమ్మం మెట్లు ఎక్కుతూనే కేకలు వేసుకుంటూ వచ్చాడు విశ్వం.

"అబ్బబ్బ! ఏమిటా పిలుపులూ? చక్కగావున్న పేరును చిత్రహింస చేసేస్తున్నారు! కాకున్నా, ఈరోజుల్లో ఇదో ఫ్యాషనైపోయింది! శారదను 'శారూ' అని, సరోజను 'సరూ!' అనీ, నిర్మలను 'నిమ్మీ' అనీ,..." పార్వతి వంటింట్లోనుంచే ప్రసారంచేస్తున్న ఉపన్యాసాన్ని వినేంత ఓపిక విశ్వానికి లేదు.

"పారూ! నీ దండకం ఆపుదూ! అరె...అరె... వెళ్ళిపోతోంది! రావోయ్ త్వరగా!" విశ్వం ఆతురత చూస్తుంటే, అంతగా విశ్వం ఊరిస్తున్న వింత ఏమిటోననే కుతూహలం పార్వతిలోనూ కలిగింది.

"ఏమిటి?" గబగబ భర్త ప్రక్కగా వచ్చినిలబడి అడిగింది పార్వతి.

"అదుగో. అటు చూడు!"

విశ్వం వేలెట్టి చూపినవేపు చూచింది పార్వతి. జన సంచారం లేని ఆ వీధి మలుపులోనుంచి, తళుక్కున మెరుపు తీవెలా మాయమయ్యింది, రెండు జడలూ, నైలాన్‌చీరె, హైహీల్డ్ బెల్టుషూస్ తాలూకు అమ్మాయి!

"ఓస్ ! అంతేనా ? ఇంకా ఏమిటో ననుకున్నాను, కొంపలు మునిగిపోతున్నట్లు కేకలువేస్తుంటే ! ఇంతకూ ఆ అమ్మాయిని నే చూడాల్సిన అవసర మేమిటో బోధ పడటం లేదు !"

"అదేనోయ్ చెబుతూంట ! ఆ అమ్మాయిని నువ్వు సరిగా చూళ్లేదుగానీ, చూచివుంటే, మూర్ఛపోదువు !"

"అలాగా ? అంత అందంగా వుంటుందా ఏమిటి ?" కుతూహలంగా అడిగింది పార్వతి.

"తిన్నగా అంటావా ఆమాట ? ఏం అందం, ఏం పెర్సనాలిటీ ? నువ్వేమైనా అనుకో పార్వతీ ! ప్చ ! మన పెళ్లిముందు నీలో ఎంతో అందం వుందని అపోహపడ్డాను ! నా కళ్లే నన్ను అలా భ్రమింపజేశాయి... కానీ నీ కంటే ఎందరో సౌందర్యవతులున్నారని, ఈరోజు ఆ అమ్మాయిని చూచి తెలుసుకున్నాను !" ఉక్రోషం ముంచుకు వచ్చింది పార్వతిలో !

"మరింకేం ? నాకు విడాకు లిచ్చేసి, ఆపిల్లే పెళ్ళిచేసు కోరాదూ ?" చరచర లోపలికి వెళ్తున్న భార్యను చూచి, మనసారా నవ్వుకున్నాడు విశ్వం.

"ఆడబుద్ధి పోనిచ్చావుకాదు !" అంటూ.

మర్నాడు...

"పారూ ! ఓసారీ ! మైడియర్ పార్వతీ ? విన్నావా ?"

"ఏమిటి ?" ముభావంగా అడిగింది పార్వతి.

"మా ఆఫీసులో ఈరోజు కొత్త లేడీటైపిస్ట్ చేరింది!"

"ఊఁ!" భర్త చెప్పబోయేదేమిటో వూహించుకుని, వినీవిననట్లు జడ అల్లుకోవడంలో నిమగ్నమైనట్లు నటించింది పార్వతి.

"అరె...వింటున్నావా?" మళ్లీ అడిగాడు విశ్వం! అతగాడి పెదవులమీద చిలిపితనం ప్రతిబింబిస్తున్న సన్నని చిరునవ్వు మొలకెత్తుతోంది.

"చెప్పారుగా? మీ ఆఫీసులో ఈరోజు కొత్త లేడీ టైపిస్ట్ చేరింది..."

"ఆఁ! మరి విను! ఆవిడెలావుంటుందో తెలుసా? నవనవలాడే లేత తమలపాకులా, అప్పుడే వికసించిన లేత గులాబి పువ్వులా...నవయౌవ్వన శోభతో..."

"చాల్లెండి...ఈ కబుర్లు వింటూంటే, అవతల కూర మాడిపోతోంది!" కోపంతో లేచిన పార్వతి చేలాంచలం విశ్వం చేతిలో చిక్కుకుపోయింది...

"హుఁ!" విదిలించుకుని, పమిటకొంగు లాక్కుని లోపలికి వెళ్ళింది పార్వతి. పార్వతి విసుగుదల ఎందుకో తెలిసిన విశ్వం హాయిగా, ఇల్లెగిరిపోయేలా నవ్వాడు.

మూడోరోజు...

"పార్వతీ!"

"..."

"పార్వతీ !"

జవాబు రాలేదు.

"ఓ పార్వతీదేవీ !"

సమాధానం రాకపోయేసరికి విశ్వం వంటింటివేపు నడిచాడు. ఉల్లిపాయలు తరుగుతున్న పార్వతి ముఖం కంపగడ్డలావుంది. సజలనయనాలతో విశ్వంవేపు చూచింది "ఏం ?" అన్నట్లు.

"ఆహా ! ఎంచక్కావున్నావ్ ? కాటుక కంటి నీరు...అంటూ పద్యం చెప్పాలనిపిస్తోందిగానీ, కాపీరైట్సు మనకు లేవుకాబట్టీ, కవిత్వానికీ మనకూ చాలాదూరమని తెలిసీ, పైగా నా గొంతుకలో పడి పోతన పాపం మరోసారి మరణిస్తాడనీ...పై కారణా లన్నింటివల్లా మానేస్తున్నాను !" తాపీగా వంటింటి గుమ్మందగ్గర పీటవాల్చుకు్కూర్చుని, క్రింద జీరాడుతున్న పార్వతి జడవేపు చూస్తూ అన్నాడు విశ్వం.

"మంచిపని చేశారు !" నిర్లిప్తంగా అంది పార్వతి.

"ముఖంచూడు ఎలావుందో ?"

విశ్వం నవ్వు పార్వతి శరీరాన్ని కోపంతో కుతకుత ఉడికించింది క్షణకాలం.

"అవును. నా ముఖమేం బావుంటుందీ ? వీధిలో వెళ్లే ఆడవాళ్ళ ముఖాలూ, ఆఫీసులో లేడీటైపిస్టుల ముఖాలూ అయితే బావుంటాయిగానీ !" ఉక్రోషంగా అంది పార్వతి.

"ఆఁ! ఈ మాటంటుంటే గుర్తొచ్చింది సుమా! నిన్నరాత్రి నేను మా స్నేహితులతో సినిమా కెళ్లానుగా? మాకంటే ముందు 'రో' లో కూర్చున్న ఓ దంపతులని చూశాను పార్వతీ! ఆవిడెంత అందంగా వుందనుకున్నావ్! క్షణకాలం ఆ భర్తగాడి అదృష్టానికీ — ఆవిడకు భర్తకాలేని నా దురదృష్టానికీ ఎంతగానో గిలగిలలాడిపోయానంటే నమ్ము...అసలు..."

"అబ్బబ్బ! ఇక ఆపుతారా లేదా? లేకుంటే నే నా నూతిలో దూకేస్తాను..." పార్వతి కంఠం దుఃఖంతో కంపించిపోయింది!

చటుక్కున పార్వతిని పొదివి పట్టుకున్నాడు విశ్వం...

"ఛ...ఛ...కన్నీళ్లా? అప్పుడే? ఊరికే తమాషాగా చెప్పగానే దుఃఖమా? అబ్బే! నా బంగారు పార్వతివి కదూ? ఊరుకో! కాకున్నా ఎంతచదువుకున్నా, ఎంత నాగరికత జీర్ణింపజేసుకున్నామని ప్రగల్భాలు పలికినా, మీ ఆడాళ్ళలో అసూయ ఏమాత్రం తరగదు పార్వతీ! పరాయిస్త్రీని మీముందు మెచ్చుకుంటే, మీరు సహించలేరు..."

విశ్వం బాహుబంధంలోవున్న పార్వతిదుఃఖం ఎంతో సేపటికోగానీ తగ్గలేదు.

ఇలాంటి సన్నివేశాలు రోజురోజుకూ ఎక్కువైపోతు న్నాయి! రానురాను విశ్వంలో ఒకరకమైన వింత సరదా వ్రేళ్ళు తన్నుకుపోయింది! ఎవరెవరో పరాయి ఆడవాళ్ళను గురించి పార్వతిముందు, కావాలనే లేనిపోని అతిశయోక్తులు

కల్పించి వల్లించటం, పార్వతి ముఖం చిట్లించుకోగానే...మన సారా నవ్వటం, అలవాటైపోయింది!

"ప్చ! ఏకభార్యా చట్టమంటూ ఒకటొచ్చిపడిందిగానీ లేకుంటే, హాయిగా ఆవిణ్ణి పెళ్లాడేద్దును..." అంటాడు విశ్వం.

"ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేముందీ?" అంటూ జవాబు దొరక్క పార్వతి బాధపడ్తుంటే, పకపకనవ్వి "మీ ఆడవాళ్ళెంత అసూయాపరులు?" అంటూ గేలి చెయ్యటం విశ్వానికి పరిపాటై పోయింది!

ఆదివారం మధ్యాహ్నం!

భోజనంచేసి, గదిలో ఈజీచైర్‌లో హాయిగా పడుకుని, ఆలోచిస్తున్నాడు విశ్వం. ఏం కొత్త కథ కల్పించి పార్వతిని ఏడిపించాలీ? అనే యోచనకు సరైన కథనం దొరకటం లేదు! పార్వతి ముందు తను మరో ఆడదాన్ని వర్ణిస్తుంటే, పార్వతి ముఖంలో ముందు ఉక్రోషం ముంచుకవస్తుంది. దాంతోబాటు కోపంతో, అసలే తెల్లగా అందంగా వుండే చక్కనిముఖం ఎఱ్ఱగా, లేతగులాబిరంగుకు తిరిగి ముద్దొచ్చేలా వుంటుంది! ఆ విశాలమైన కళ్ళల్లో నీళ్లు సుడులు తిరుగుతుంటే, ఆమెను తను ఓదార్చటం బ్రాకెట్సులో విషయమైనా, తన కా దృశ్యం ఎంత హాయిగానో వుంటుంది! ఆ అనుభూతి, అనుభవం ఆనందం కల్గిస్తుంటుంది!

ఇదే సమయంలో, వంటింట్లో పనిముగించుకు వస్తున్న పార్వతి బుర్రలో కూడా మెరుపులాటి ఆలోచన మెరిసింది!

ఒక్కసారి హాయిగా నిట్టూర్చి, వీధిగుమ్మం దగ్గరకు వెళ్ళింది పార్వతి !

"ఏమండీ ! ఏమండోయ్ ! త్వరగా రాండి !"

గాభరాగా, బయటికి పరుగెత్తుక వచ్చాడు విశ్వం. వరండాలో నిల్చుని, మునిగాళ్ళమీద నిలబడి, వీధివేపు కుతూహలంగా చూస్తోంది పార్వతి.

పార్వతి వెనుకగా నిల్చుని "ఏమిటి ?" అన్నాడు విశ్వం...

"అరె అరె వెళ్ళిపోతున్నాడు !" అలాగే కంగారుగా అరుస్తోంది పార్వతి...

"ఎవరు ?" వీధిలోపోయే అంతమంది జనంలో, పార్వతి ఎవరిని గురించి చెబుతోందో బోధపడలేదు విశ్వానికి.

"ప్చ ! వెళ్ళిపోయాడు !" పార్వతి నిట్టూర్చింది.

"ఎవరంటూంటే ?" బొమ ముడివడింది విశ్వానికి !

"ఎంత అందంగా వున్నాడండీ అతగాడు ? మగాళ్ళలో అంత అందమైన వాళ్ళుంటారని ఈరోజు వరకూ నాకు తెలీదు సుమండీ !" కలలో తేలిపోతున్నట్లు అంది పార్వతి !

ఉక్రోషంతో, విశ్వం పిడికెళ్ళు బిగబట్టాడు.

"ఇంతకూ ఎవరంటూంటే ?" విశ్వం అరిచాడు.

"బావుంది. నాకు మాత్రమేం తెలుసూ, ఎవరో ?" పార్వతి చిరునవ్వు నవ్వింది ! ఆ చిరునవ్వు విశ్వం వంటిమీద కారం రాచినట్లుగా ప్రాకింది !

"ఇలా వీధిలో నిల్చుని, దోవనపోయే మగాళ్లని వర్ణించడమేనా నీపని ?" పళ్లు పటపట కొరికాడు విశ్వం.

"ఇది మరీ బావుంది! అందమైన వస్తువు కన్పిస్తే, ఆదమరచి చూడటం మానవ స్వభావం, అందునా కళ్ళకున్న ప్రత్యేకతే అది!" పార్వతి చిలిపి సమాధానం విశ్వానికి ఒళ్ళుమండేలా చేసింది!

"చాల్లే, మాటలు నేర్చావ్!" చిరచిరలాడుతూ లోపలికి వచ్చాడు విశ్వం. ముసిముసిగా నవ్వుకుంటూ అనుసరించింది పార్వతి.

"ఏం మగాళ్లో! ఏమాట అన్నా తప్పే! కోపమే!" గొణుక్కుంటూ భర్త దగ్గరగాకూర్చుంది పార్వతి.

కొద్దికొద్దిగా కలకబారిన మనస్సుతో కూర్చుని వున్నాడు విశ్వం.

"రాత్రి, నాకో చక్కటి కలవచ్చిందండీ!"

తమలపాకులు చీల్చి ఇస్తూ మెల్లిగా అంది పార్వతి.

"ఏమిటి ?" ఇందాకటి కోపం ఇంకా తగ్గని విశ్వం ముభావంగా అన్నాడు.

"చెప్పనా ?" గోముగా అడిగింది పార్వతి.

"చెప్పమనేగా ?"

"మీకు కోపం రాదంటే..." సాగదీసింది పార్వతి.

"అబ్బ! చెప్పొదూ చంపక!" విశ్వం చిరాకు పార్వతిలో హుషారు రేకెత్తిస్తోంది.

"ఎక్కడికో మనిద్దరం షికారు వెళ్లామట! చుట్టూరా విరగబూసిన పూలమొక్కలతో వింత రంగులకాంతి వెదజల్లుతూ, ఆ ప్రకృతి ఎంత ఆహ్లాదకరంగా వుందనీ? ఇల్లాగే ప్రక్క-ప్రక్కన కూర్చుని మనిద్దరం హాయిగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నాం కలలో!"

విశ్వం కుతూహలంగా ముందుకు వంగికూర్చున్నాడు. "తర్వాత?" అన్నాడు.

"అబ్బ! ఎంత తియ్యటి కలండీ!" ఈ క్షణంలో కూడా ఆ కల తాలూకు తియ్యదనం అనుభవిస్తున్నట్లు పార్వతి కళ్ళు అరమోడ్పు లయ్యాయి.

"అవును. నాకూ అలాగే అనిపిస్తోంది...మనిద్దరం అలా కబుర్లు చెప్పుకుంటున్నాం! తర్వాతేమయింది పార్వతీ?" తనూ ఆకలలో, ఆ రసాస్వాదనలో భాగం పంచుకుంటూ అడిగాడు విశ్వం.

"...ఇంతలో అక్కడికో చక్కని యువతీ, నవ మన్మధుడిలాంటి యువకుడూ వచ్చారు! ఏం చెప్పమంటారు? ఆ యువతి ఓమోస్తరుగావుందిగానీ, అతగాడు మాత్రం సౌందర్యమంతా మూర్తీభవించి మూసపోసినట్లున్నాడండీ!" విశ్వం ముఖంలో మారుతున్న రంగుల్ని క్రీగంటితో చూస్తూ క్షణకాలం ఆగింది పార్వతి.

"వర్ణన తర్వాత...ఏమయిందో చెప్పు!" చిరాకు పడ్డాడు విశ్వం.

"మీరేమో ఆ యువతి వేపు మింగేసేలా చూస్తున్నారు! ఆ అమ్మాయి సిగ్గుతో చచ్చిపోతోంది, మీ చూపులకు తట్టుకోలేక...మీరు మెల్లిగా కన్నుగీటారు! అంతే. ఆ అమ్మాయి ఒక్కవుదుటున ఆ యువకుడి దగ్గరకు పరుగెత్తింది. 'చూడన్నయ్యా! అతను నన్నెలా చూస్తున్నాడో!' అంది రోషంగా! అంతే! ఆ యువకుడు కోపంతో అగ్గిబుగ్గయిపోయాడు!

"ఏయ్ మిస్టర్! మా చెల్లాయివేపు అలా వెర్రి చూపు చూస్తావేం?" అన్నాడు కోపంగా మీతో! అంతటి కోపంలోనూ అతగాడెంత అందంగా వున్నాడనుకున్నారూ?" పార్వతి చెప్పటం ఆపి విశ్వంవేపు చూసింది.

సంధిగ్ధావస్థలో 'వద్దు' అనిగానీ 'చెప్పు!' అని గానీ చెప్పలేక నానాయాతనా పడుతున్నాడు విశ్వం!

"హూం! ఏం చెప్పమంటారు? చూస్తుండగానే అతగాడు మీ షర్టుకాలర్ దొరకబుచ్చుకున్నాడు! 'ఆగండి' అని నేను అరచేలోగానే మీ చెంపలు వాయించేసాడు! ఇక నేను చూస్తూ వూరుకోలేకపోయాను. మీరూ పోరాటానికి సిద్ధపడుతున్నారు...మీ ఇద్దరి మధ్యకూ వచ్చాను. అతగాడివేపుతిరిగి......చూడండి! మీరిలా ప్రవర్తించటం నాకేమీ బాగాలేదు! మావారు చిన్నసైజు కవి! అంచేత కాస్త అందమైన వస్తువునైనా, అందమైన స్త్రీలవేపైనా కాస్త అలా కళ్ళప్పగించి చూస్తారు...అంతకు మించి మరే చెడుఉద్దేశ్యాలూ వారికి లేవు..." అన్నాను...

కోపంతో బుసలుకొడ్తున్న ఆ యువకుడు క్షణకాలం నావేపు పరకాయించి చూశాడు. "మీరు చెబుతున్నారు కాబట్టి, మిమ్మల్ని చూచి వదిలేస్తున్నాను! లేకుంటే ఎముకలు చితగ్గొట్టే శేవాణ్ణి ఈరోజు మీ వారిని!" అన్నాడు.

"ప్లీజ్! వారిని వదిలెయ్యండి!" అన్నాను.

"అలాగే!" నావేపు చూచి నవ్వాడతగాడు! అబ్బ! ఆ నవ్వెంత మధురంగా వుందనుకున్నారూ?" పార్వతి కలలాంటి కథ, కథలాంటి కల చెప్పటం ఆపింది!

అందాకా బిగబట్టుకున్న విశ్వం ఛ(ర్రుమన్నాడు ఒక్కసారిగా! "చాల్లే నోర్ముయ్! అడ్డమైన వాడినవ్వు మధురంగా వుంటుంది నీకు...హద్దూపద్దూ లేకుండా ఆలోచిస్తే, ఇలాంటి వెధవకలలు రావూ?"

పార్వతి కిలకిల నవ్వింది. "అంతకోప మెందుకండీ? కలలో కనిపించేవన్నీ జరుగుతాయా? అయినా, కల ఇలా వచ్చిందని చెప్పటమూ తప్పే?"

"వెధవ కలా నువ్వూను! మానసిక ఆలోచనలకు ప్రతిబింబాలే కలలు..." విశ్వం పళ్లు పటపట కొరుక్కుంటున్నాడు చేసేదిలేక!

"అవును మరి...మానసిక ఆలోచనలకు ప్రతిబింబాలే మాటలుకూడా అంటారు. కలలో కనిపించిన విషయాలు చెబితేనే మీ కింత కోపంగావుంది! కాకున్నా, ఎంత చదువుకున్నా, ఎంత సంస్కారపూరితులమనీ, విశాలహృదయులమనీ

డబ్బావాయించుకున్నా, మగాళ్ళలో, అసూయపాలు హెచ్చుగానే వుంటుంది సుమండీ! ముఖ్యంగా భార్య తన ఎదుట పర పురుషుణ్ణి గురించి కాస్తగొప్పగా నాలుగు ముక్క లన్నా చాలు, మరిగే నీళ్ళలో పడిన బంగాళాదుంపలా కుతకుత ఉడికిపోతారు!"

ఏదో కలలోనుంచి మెలకువ వచ్చినట్లయ్యింది విశ్వానికి! పార్వతివేపు చూశాడు! చిరునవ్వులు చిలికిస్తోంది! క్షణంలో అర్థమయింది విశ్వానికి! అందాకా అతగాడి హృదయమంతా అలుముకునివున్న కోపం ఒక్కసారిగా మాయమై, ఆనందం ఆవరించుకుంది.

"అమ్మదొంగా! అదా కథ! నాపాఠం నాకే అప్పజెప్పి, నన్ను ఫూల్‌ను చేశావన్నమాట! ఒక్కసారి చెప్పు పార్వతీ! నోరారా చెప్పు! ఇప్పుడు నువ్వు చెప్పిందంతా కట్టుకథేననీ — కనీసం కలలోకూడా అలా జరగలేదనీ, జరగబోదనీ!" పార్వతి భుజాలచుట్టూరా చేతులువేసి లాలనగా, వేడుకుంటూ అడిగాడు విశ్వం!

"పార్వతి మెల్లిగా నవ్వింది! శ్రీవారూ! ఎంత భార్యాభర్తలయినా, ఎంత సంస్కారపూరితులయినా, స్త్రీ పురుషులలో అంతర్గతంగా అసూయారేఖ ఒకటి దాగి వుండనే వుంటుంది! ముఖ్యంగా, ఒకరిమీద మరొకరికి అనురాగం అవధులు దాటినప్పుడు, అందులో ఏ ఒక్కరూ, తమను నిర్లక్ష్యంచేసి, మరొకర్ని తమముందు పొగిడితే సహించలేరు! ఇది భార్యాభర్త లిద్దరిలోనూ వుండే అనురాగానికీ,

అసూయకూ నిదర్శనం! మనస్సులో రేగే ప్రతి వెకిలిభావమూ ప్రక్కవారితో చెప్పాకుంటే, ఇలాగే వుంటుంది! నిజంగా అలాంటి భావాలు రేగినా, భార్యాభర్తలు ఒకరితో మరొకరు ఆ సంగతులు మాట్లాడుకోకపోవటమే హాయి! ఆ ఒక్క విషయంలో మాత్రం ఇద్దరి మధ్యా సన్నని జరీజలతారులాంటి తెరవుండాలి! అది తొలగిస్తే, ఇలాగే రసాభాసమాతుంది శ్రీవారూ!" పార్వతి గుక్క త్రిప్పుకోవటానికి ఆగింది. "ఇవి 'చేదునిజాలు' శ్రీవారూ!" అంది మళ్ళీ!

"హియర్...హియర్! ఇకచాలు పార్వతీ! నాకు జ్ఞానోదయం అయింది! ఇకనుంచి అనవసరంగా సరదాకోసం, నీముందు లేనిపోని అతిశయోక్తులతో పరాయి ఆడవాళ్ళని వర్ణించి నిన్ను ఏడిపించను...కానీ నాదొక మనవి. ప్లీజ్! నీ కలలోవచ్చిన అందగాళ్ళ వివరాలు మాత్రం నాకు చెప్పకు! నాకు నిజంగానే ఏడుపొస్తుంది!" పసిపిల్లాడిలా పార్వతి పమిటకొంగులో ఇమిడిపోయాడు విశ్వం.

నిండుగా నవ్వింది పార్వతి!